క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



వేలేరు : మండలంలోని కన్నారం గ్రామానికి చెందిన మహ్మద్ రజాక్ సెల్‌ఫోన్ తన షాప్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో పోగొట్టుకున్నాడు. దీంతో వేలేరు పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా దర్యాప్తు చేపట్టిన పోలీసులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ట్రాప్‌చేసి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బాధితుడికి అప్పగించడంతో రజాక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సివిల్ సప్లయీస్ కార్మికుల దీక్ష విరమణ



పరకాల: తెలంగాణ ప్రభుత్వం సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల వేతనం పెంచేందుకు ఒప్పుకోవడంతో పరకాలలో ఏడు రోజులుగా సమ్మె చేస్తున్న సివిల్ సప్లయ్ కార్మికులు మంగళవారం దీక్ష విరమించారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లంకదాసరి అశోక్ దీక్షలో పాల్గొన్న కార్మికులకు నిమ్మరసం అందజేసి విరమింపజేశారు. కార్యక్రమంలో హమాలీ నాయకులు మచ్చ శంకర్, మచ్చ సందీప్, గడ్డం సురేష్, బొచ్చు శంకర్, కొమ్ముల మహేందర్, బొచ్చు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ను మండలం చేయాలని తీర్మానం



కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌ను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ ప్రత్యేకాధికారి ప్లవన్ మజుందార్ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్‌తో పాటు ఉప్పల్ చుట్టుపక్కల ఉన్న ఉప్పులపల్లి, భీంపల్లి, కన్నూరు, కొత్తపల్లి, గుండేడు, దేశరాజుపల్లి, గుంటూర్‌పల్లి, కానిపర్తి, శంభునిపల్లి, హుజూరాబాద్ మండలంలోని ధర్మరాజుపల్లి తదితర 9 గ్రామాలను కలుపుకొని ఉప్పల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజల సమక్షంలో గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. ఈ తీర్మాన ప్రతిని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్: స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 ప్రవేశ పరీక్ష రుసుము చెల్లించి, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫోటో జత చేసి htt pr-://te a nfa nam-r.c-f-f.gov.i n/ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉద్యమకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేశ్



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన గిద్దమారి సురేశ్‌ను తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ నందగిరి రజనీకాంత్, కో–కన్వీనర్ పాడిశెట్టి గణేష్‌లు ప్రకటించారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబారావు, ఉమ్మడి వరంగల్ జిల్లా, మండల నాయకులకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణగిరి జెడ్పీహెచ్ ఎస్‌కు ఎక్సలెన్స్ అవార్డు



విద్యారణ్యపురి: ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి జెడ్పీహెచ్‌ఎస్‌ను ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుకు హైబిజ్ టీవీ ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో స్కూల్ హెచ్ఎం డాక్టర్ బి.రాంధన్ అవార్డు అందుకున్నారు. శాంతా బయోటెక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి ఆయనకు అవార్డు ప్రదానం చేశారు.

చెత్తపై ఇంత నిర్లక్ష్యమా ?

- ప్రమాదంలో పట్టణం..!
- మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డులోనే పనికిరాని పరికరాల కాల్చివేత
- నిబంధనలు ధిక్కరిస్తున్న షాపుల యాజమాన్యాలు



బాలికల ప్రభుత్వ పాఠశాల ఎదుట తగులబడుతున్న చెత్త

పరకాల : పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న దృష్ట్యా చెత్తను కాల్చడం నేరమని..కాల్చేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒకవైపు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరకాల మున్సిపాలిటీ సిబ్బంది పెడచెవిన పెడుతోంది. రోజు రోజుకు పొగ కారణంగా కాలుష్యమై ప్రజల అనారోగ్యం బారిన పడుతున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలు ధిక్కరిస్తే వారిపై చట్టపరమైన చర్యలకు వెనుకడుగు వేయవద్దని కార్పొరేషన్, మున్సిపల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు సైతం జారీ చేశారు. ఈ విషయాన్ని మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మున్సిపల్ ఆఫీస్ రోడ్డులో దట్టమైన పొగలు

మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పాత ఇనుప సామాను దుకాణదారులు ఏ మాత్రం కాలుష్య నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఇనుప సామాను, కేబుల్స్, ఫ్రిడ్జ్‌లను కార్యాలయం పక్కనే ఉన్న కుంటవద్ద తగులబెడుతున్నారు. దీంతో నిత్యం మున్సిపాలిటీ రోడ్డు దట్టమైన పొగతో సమీప కాలనీ వాసులు, చుట్టు పక్కల ప్రజలు శ్వాసకోశ వ్యాధులు బారినపడే పరిస్థితి నెలకొంది. ఒక్కో సమయంలో మున్సిపల్ కార్యాలయం సైతం పొగతో నిండిపోతుంది. అలాగే ఫంక్షన్ హాల్స్ యాజమాన్యాలు సైతం చెత్త, చెదారాన్ని మున్సిపల్ వాహనాలతో తరలించాల్సి ఉండగా సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లోనే తగులబెడుతున్నారు.



మున్సిపాలిటీ రోడ్డులో తగులపడుతున్న ఫ్రిడ్జ్

ట్రాక్టర్లు సరిపోవడం లేదు

చెత్తను తగులబెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట నిజమేనని పారిశుద్ధ్య కార్మికురాలు ఆవేదన వెలిబుచ్చింది. తాము వీధులన్నీ ఊడుస్తు చెత్తను కుప్పలుగా వేస్తున్నాం. సమయానికి మున్సిపాలిటీ ట్రాక్టర్లు చెత్తను తీసుకెళ్లడానికి రావడం లేదు. దీంతో చెత్తను పందులు, కుక్కలు, పశువులు వీరంగం చేస్తున్నాయి.

శ్వాసకోశవ్యాధుల బారిన ప్రజలు



చెత్తను తగులబెట్టడం వలన ప్రజలు శ్వాసకోశవ్యాధుల బారిన పడటం జరుగుతుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నందున ఎక్కడ కూడా చెత్త, చెదారం తగులబెట్టకుండా చేయాలి. – నాగబండి విద్యాసాగర్, సిటిజన్ ఫోరం కన్వీనర్, పరకాల

చెత్త తగులబెడితే చర్యలు



చెత్తను తగులబెట్టకుండా తప్పకుండా చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీ సిబ్బందికి కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం. నిబంధనలు ధిక్కరించే వారిపై చర్యలు తీసుకుంటాం. – సుష్మా, మున్సిపల్ కమిషనర్, పరకాల

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- కమలాపూర్ సీఐ హరికృష్ణ

కమలాపూర్: వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ హరికృష్ణ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కమలాపూర్ పోలీసులు, తెలంగాణ సాంస్కృతిక సారథి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కమలాపూర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, వాహనాలను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, కళాకారులు

సామాజిక వర్గానికి అధ్యక్ష పదవి అప్పగించాలి

కమలాపూర్: సామాజిక వర్గానికి చెందిన వారికి కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి అప్పగించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పాడేటి భిక్షపతి అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన కమలాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ తాను 15 ఏళ్లుగా పార్టీలో నిబద్ధత గల క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. పదేళ్లు పార్టీ అధికారంలో లేకపోయినప్పటికి పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నానని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ప్రకటించగా అందులో ఒకరు వెలమ, ఒకరు రెడ్డి, మరో ఇద్దరు బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారికి అవకాశం కల్పించారన్నారు. కమలాపూర్ మండలానికి ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన విద్యావంతుడినైన తనకు అవకాశం కల్పించాలని పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌తో పాటు మంత్రులు, కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని భిక్షపతి కోరారు.

22 లీటర్ల గుడుంబా పట్టివేత

- ముగ్గురి అరెస్ట్

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం నుంచి పత్తిపాక గ్రామానికి ఆటోలో గుడుంబా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో పత్తిపాక గ్రామ శివారులో 22 లీటర్ల గుడుంబాను పట్టుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గంగిరేణిగూడెం నుంచి పత్తిపాకకు ఆటోలో గుడుంబా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో మంగళవారం గ్రామశివారులో రూట్‌వాచ్ చేస్తుండగా గంగిరేణిగూడేనికి చెందిన బానోతు మమత, రమేష్, ప్రగతి సింగారం గ్రామానికి చెందిన దూలం మధుసూదన్‌లు ఆటోలో గుడుంబా తరలిస్తుండగా పట్టుకొని తనిఖీ చేయగా 22 లీటర్ల గుడుంబా లభ్యం కావడంతో ఆటోను, గుడుంబాను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా గుడుంబా అమ్మినా, తయారు చేసిన వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సులోచన, సివిల్ ఏఎస్సై కుమారస్వామి, కానిస్టేబుల్స్ ఖలీద్ పాల్గొన్నారు.



గుడుంబాను తరలిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



పరకాల: ఇటీవల హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పరకాల పట్టణంలోని బిట్స్ విద్యార్థి చిలువేరు హర్షతేజ టేబుల్ టెన్నిస్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంఈఓ రమాదేవి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్ సన్మానించి అభినందించారు. అదేవిధంగా పాఠశాలలో విజేతగా నిలిచిన విద్యార్థి హర్షతేజతో పాటు పీఈటీ శ్రీకాంత్‌లను పాఠశాల ప్రిన్సిపాల్ యుగేంధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు : మండలంలోని పున్నేలు క్రాస్‌వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులకు క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నందున క్షీరాభిషేకం చేశామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకం ద్వారా భూమి లేని వారికి ఏడాదికి రూ.12 వేలు, భూమి ఉన్న రైతులకు ఎకరాకు రూ.12 వేల చొప్పున అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, బుచ్చిరెడ్డి, మధు, ఎలిషా, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడేనికి చెందిన నేరెళ్ల రాయమల్లు (65) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లిగూడేనికి చెందిన రాయమల్లు–సుభద్ర దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఐదేళ్ల క్రితం పెద్ద కొడలు చనిపోగా, మూడేళ్ల క్రితం చిన్నకొడుకు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి వారికి అప్పులై కుటుంబపోషణ భారం కష్టమైంది. దీంతో కొంత కాలంగా తాగుడుకు బానిసై అనారోగ్యానికి గురైన రాయమల్లు జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డులో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి భార్య సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘రేషన్’లో 14 రకాల సరుకులు ఇవ్వాలి

సంగెం/గీసుకొండ : రేషన్ షాపుల ద్వారా పేదలకు 14 రకాల సరుకులు అందించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కనకం సంధ్య ఆధ్వర్యంలో సంగెం, గీసుకొండ మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆయా కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ సంగెం మండల కన్వీనర్ రౌతు రేణుక, నాయకులు పెండ్యాల లలిత, స్వప్న, యమున, వీరలక్ష్మి, ప్రసన్న, సరిత, రమ, కోమల, రాజమ్మ, కృష్ణవేణి, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సంగెం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సంధ్య, నాయకులు

బాలల జన్మదిన వేడుకలు

గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిలో బాలవికాస ఆధ్వర్యంలో దత్తత తీసుకున్న 13 మంది పేద బాలల జన్మదిన వేడుకను మంగళవారం నిర్వహించారు. జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి, స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్ బాలలతో కేక్ కట్ చేయించి మాట్లాడారు. జిల్లాలోని ఆరు మండలాలకు చెందిన 23 గ్రామాల బాలవికాస మహిళలు పేద బాలలను దత్తత తీసుకోవడం అభినందనీయమని చెప్పారు. ప్రోగ్రాం అధికారి లత, ఎఫ్ఏ రమ్య, గూడ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం మండల కమిటీ ఎన్నిక



రవీందర్, మండల అధ్యక్షుడు

శాయంపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీని మంగళవారం ఉమ్మడి జిల్లా కన్వీనర్ నందగిరి రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సాంబరావు, ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ పాడిశెట్టి గణేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇమ్మడిశెట్టి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా చల్లా శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా వనం దేవరాజ్, ఎండి.రఫీ, కోశాధికారిగా కానుగుల నాగరాజు, సహాయ కార్యదర్శులుగా ఎండి.రాజ్‌మహ్మద్, తుమ్మ ప్రభాకర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా బలిజే నరసింహరాములు, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య సలహాదారులుగా కడివెండి సాంబమూర్తి, చిందం ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులుగా పల్లెబోయిన సారయ్య, గిద్దమారి సురేశ్, కార్యవర్గ సభ్యుడిగా గిద్దమారి రామన్న ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం పోరాడుతామని వారు తెలిపారు.

జలుబు, దగ్గు ఉంటే మాస్కులు ధరించాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య

ఐనవోలు : జలుబు దగ్గు వంటి లక్షణాలున్న వారు మాస్కులు ధరించాలని, దగ్గినపుడు నోటికి చేతి రుమాలు అడ్డుగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ అప్పయ్య సూచించారు. హెచ్ఎంపీవీ వైరస్ కొన్ని చోట్ల వచ్చినప్పటికీ ఆందోళనకు గురికాకూడదన్నారు. పరిశుభ్రత పాటించడం వల్ల ఈ వైరస్‌కు దూరంగా ఉండవచ్చన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆషాడే మీటింగ్‌లో ఆశాలకు శ్వాసకోశ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. జ్వరం, రాషెస్ వస్తున్న కేసులను సర్వే చేయాలన్నారు. ఎన్‌సీడీ, వీహెచ్ఎన్ఎస్‌సీ ఖచ్చితంగా చేయాలని సూచించారు. ఎన్‌సీడీలో 30 ఏళ్లు నిండిన అందరికీ వందశాతం రీ స్క్రీనింగ్ చేయాలన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, శ్రీనివాస్, కృష్ణమూర్తి, ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

‘ఉపాధి’ పనులు సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్డీఓ మేన శ్రీను

దామెర: కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ మేన శ్రీను అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో నిర్వహిస్తున్న ఎల్‌డీపీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పేమెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని పరిశీలించి మాట్లాడారు. ఉపాధిహామీ పనులకు అధికసంఖ్యలో కూలీలు పాల్గొనాలని సూచించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎండిన మొక్కల స్థానంలో నూతన మొక్కలను నాటాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శి ధర్మారెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ముస్త్యాలపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీను

విద్యతో పాటు శారీరక ఆరోగ్యం అవసరం

- పరకాల సీఐ క్రాంతికుమార్

పరకాల: చదువుతో పాటు శారీరక ఆరోగ్యం చాలా అవసరమని పరకాల సీఐ క్రాంతికుమార్ అన్నారు. పట్టణంలోని విద్యాలయ ఉన్నత పాఠశాల ఆవరణలో చిల్డ్రన్ పార్క్‌ను మంగళవారం ప్రారంభించారు. చదువుతో పాటు విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన, గౌరవాన్ని నేర్పించడంలో విద్యాలయం ఉన్నత పాఠశాల యాజమాన్యం చూపిస్తున్న చొరవ స్ఫూర్తిదాయకమన్నారు. అదే విధంగా విద్యార్థులు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన పెంచుకోవడంతో పాటు తల్లిదండ్రులకు తెలియజేయడం వలన భవిష్యత్‌లో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గోపి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిల్డ్రన్ పార్క్‌ను ప్రారంభిస్తున్న సీఐ క్రాంతికుమార్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్

దామెర: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాలల హక్కులు, రక్షణ చట్టాలపై సఖి సేవా సంస్థ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సౌజన్య, గణపతి, లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతా లోపాలపై విచారణ చేపట్టాలి

కమలాపూర్: మండలంలోని కన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ల్యాబ్ నిర్మాణంలో నాణ్యతా లోపాలపై విచారణ జరిపించాలని క్రియేటివ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పెర్క కృష్ణభాస్కర్ కోరారు. ఈ మేరకు మండల విద్యాధికారి రాంకిషన్ రాజు, ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణభాస్కర్ మాట్లాడుతూ పాఠశాలలో నిర్మించిన సైన్స్ ల్యాబ్ నాణ్యత పాటించకుండా నాసిరకం మెటీరియల్‌తో నిర్మించారన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లోనూ నిర్మించిన నిర్మాణాల్లో నాణ్యత పాటించలేదని, వీటిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న క్రియేటివ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కృష్ణభాస్కర్

సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలి

దామెర: తెలుగు సంస్కృతి సంప్రదాయాలని ప్రతి ఒక్కరూ గౌరవించాలని డీస్నీల్యాండ్ పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డీస్నీల్యాండ్ ఇ టెక్నో స్కూల్‌లో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఇంట ముగ్గులు వేసుకోవడం సంప్రదాయంగా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ముఖ్యసలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, డైరెక్టర్లు రాకేష్‌భాను, దీనేష్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు